క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేగిడి: మండలంలోని సోమరాజుపేటలో ప్రకృతి వ్యవసాయంపై సోమవారం అవగాహన కల్పించారు. ఏవో జి.మురళీకృష్ణ మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు చేసే పంటలను ప్రకృతి వ్యవసాయ విధానాలు అనుసరిస్తూ పండిస్తే అధిక లాభాలు ఆర్జించవచ్చన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం సంపాదించాలంటే ప్రకృతి సాగు ఒక్కటే మార్గమన్నారు. ప్రకృతి సాగులో సేంద్రియ ఎరువుల ద్వారా ఆరోగ్యవంతమైన పంటలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సవలాపురపు రమేష్ నాయుడు, ఐసీఆర్‌పీలు పుర్లి లక్షుంనాయుడు, కరణం వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



కారు డిక్కీలో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ గోపాలరావు

సంతకవిటి: మండల వ్యాప్తంగా పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. మండల పరిధిలోని పొనుగుటివలస జంక్షన్ వద్ద ఎస్‌ఐ ఆర్.గోపాలరావు తన సిబ్బందితో కలిసి సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారి లైసెన్స్‌తో పాటు వాహన ధ్రువపత్రాలను క్షుణ్నంగా పరిశీలించారు. లైసెన్స్, వాహన ధ్రువపత్రాలు లేని వారికి అపరాద రుసుం విధించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలు విధిగా పాటించాలని, మత్తు పదార్థాల రవాణా చేయరాదని ఎస్‌ఐ సూచించారు.

ఎన్నికల అధికారులకు శిక్షణ



ఎన్నికల అధికారులకు సూచనలిస్తున్న ఏఈ సుధీర్

బొబ్బిలిరూరల్: నీటి సంఘాల ఎన్నికలకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. మండలంలో ఈ నెల 14వ తేదీన ఎన్నికలు జరగనుండగా, మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల అధికారులకు సోమవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో పి.రవికుమార్ ఆధ్వర్యంలో ఇరిగేషన్ శాఖ ఏఈ శంబంగి సుధీర్.. ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు.

'ఉపాధి' పనుల బాధ్యత మేట్‌లదే..



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ జగన్మోహనరావు

రేగిడి: ఉపాధి హామీ పథకం పనులు సక్రమంగా చేయించాల్సిన బాధ్యత మేట్‌లదేనని వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు అన్నారు. స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో మేట్‌లకు సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కాసేపు మాట్లాడారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలని, వేతనదారులతో నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేయించి, వారికి గిట్టుబాటు అయ్యే వేతనం వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఎస్.హరనాథరావు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల అందజేత



సర్టిఫికెట్లు అందుకున్న శిక్షణార్థులతో నిర్వాహకులు

బొబ్బిలి: పట్టణంలోని స్వయం ఉపాధి శిక్షణా కేంద్రంలో స్థానిక అభిమాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చారు. సోమవారంతో వారి 45 రోజుల శిక్షణ పూర్తి కాగా శిక్షణార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. మొత్తం 43 మంది మహిళలు కుట్టుమిషన్ శిక్షణ పొందారని, ఇది వారి జీవనోపాధికి దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి రాజగోపాలనాయుడు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

కూరల సాగు.. లాభాలు బాగు!



రాజాం మండలం ఒమ్మి వద్ద బెండ సాగు

- ప్రధాన ఆదాయ వనరుగా కూరగాయలు
- మార్కెట్‌లో పంటలకు మంచి డిమాండ్
- సాగుపై ఆసక్తి కనబరుస్తున్న రైతులు
- పెరిగిన కూరగాయల సాగు విస్తీర్ణం

రాజాం:

కూరగాయల సాగు.. ప్రస్తుతం రైతుకు కలసి వస్తున్న పంట. ఏడాది పొడవునా నీటి వనరులు ఉన్నచోట పండించుకుంటే మంచి ఆదాయమే వస్తుంది. గతంలో అక్కడక్కడ మాత్రమే కూరగాయల సాగు కనిపించేది. ఇతర ప్రాంతాల నుంచి రాజాం పట్టణంతో పాటు మండలంలోని గ్రామాలకు దిగుమతి అయ్యేవి. ఇప్పుడు అలా కాదు.. ప్రతీ పంచాయతీలోనూ కూరగాయలు సాగు చేపడుతున్నారు. రైతులు తమ పొలాల్లో కొంత భాగాన్ని కూరగాయల సాగుకు కేటాయిస్తున్నారు. నీటి వనరులు ఉన్నచోట ఖరీఫ్, రబీ సీజన్‌లలో సైతం కూరగాయలు పండిస్తున్నారు. సాగునీటి కాలువలు, వర్షాధారణ భూములు ఉన్నచోట ఖరీఫ్ సీజన్‌లో కూరగాయ పంటలు వేసి, అదనపు ఆదాయం సంపాదిస్తున్నారు.

నాలుగు మండలాల్లోనూ..

రాజాం నియోజకవర్గంలోని వంగర, సంతకవిటి, రాజాం, రేగిడి మండలాల్లో కూరగాయల సాగు విస్తృతం చేశారు. రాజాం మండలంలోని ఒమ్మి, కొత్తపేట, పెనుబాక, బొద్దాం, సోపేరు, గార్రాజుచీపురుపల్లి తదితర గ్రామాల్లో కూరగాయల సాగు అధికంగా ఉంది. ఆయా ప్రాంతాల్లో సాధారణంగా ఎప్పుడూ పండించే టమాటా, బెండ, బీర, సొర, మునగ పంటలతో పాటు వాణిజ్య పరంగా మంచి డిమాండ్ ఉన్న క్యాప్సికమ్, బీన్స్ వంటి పంటలు కూడా పండిస్తున్నారు. వంగర మండలంలోని ఎం.సీతారాంపురం, వీవీఆర్ పేట, కొప్పర, సంగాం, మరువాడ, కింజంగి తదితర గ్రామాల్లోనూ కూరగాయల సాగు అధికంగా చేపడుతున్నారు. ప్రస్తుతం క్యాబేజీ, టమాటా, బెండ వంటి పంటలు ఈ ప్రాంతాల్లో పండిస్తున్నారు. రేగిడి మండలంలోని అంబఖండి, ఖండ్యాం, కోడిశ, తునివాడ, వెంకటాపురం, కొమెర తదితర గ్రామాల్లో సైతం కూరగాయలు అధికంగా పండిస్తున్నారు. క్యాబేజీ, బీర, సొర, చిక్కుడు పంటల సాగు ఎక్కువగా ఈ ప్రాంతాల్లో ఉంది.

పండిన చోటే విక్రయాలు..

సంతకవిటి మండలంలోని పుల్లిట, హొంజరాం, పోడలి, రామారాయపురం, మల్లయ్యపేట, మిర్తివలస, సంతకవిటి, ముకుందపురం, సిరిపురం తదితర గ్రామాల్లో క్యాబేజీ, టమాటా, బీర, బెండ, వంగ పంటలతో పాటు దొండ, క్యారెట్, ఎర్రదుంప, తెల్లదుంప జాతి పంటలు ఎక్కువగా పండిస్తున్నారు. పంటలు పండించే వారంతా ఆయా మండల కేంద్రాల్లోనూ లేకపోతే రాజాం మార్కెట్‌కు పంటలు తరలించి, విక్రయిస్తున్నారు. మరికొంత మంది అయితే తమ ద్విచక్ర వాహనాలపై కూరగాయలు తీసుకువెళ్లి, ఉదయం, సాయంత్రం అమ్మేస్తున్నారు. ఇంకొంతమంది అయితే వినూత్నంగా పంట పొలం వద్దనే పండిన పంటను స్టాల్ వేసి మరీ విక్రయిస్తున్నారు.

45 నుంచి 60 రోజుల్లో పంట చేతికి..

మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగానే రైతులు కూరగాయలు పండిస్తున్నారు. పొలాల్లో ప్రధాన పంటల్లో అంతర పంటలుగా క్యాబేజీ, టమాటా వంటి పంటలు సాగు చేయడంతో పాటు పొలాల గట్లు పైనే తీగజాతికి చెందిన బీర, ఆనప, సొర, చిక్కుడుకాయ పంటలు వేస్తున్నారు. కొంతమంది రైతులు అయితే మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉన్న బంతి, చేమంతి పూల సాగు చేపడుతున్నారు. మరికొంతమంది గోంగూర, తోటకూర, పుదీనా, పాలకూర, చుక్క కూర వంటి ఆకుకూరలు పండిస్తూ అదనపు ఆదాయం సమకూర్చుకుంటున్నారు. 45 నుంచి 60 రోజుల వ్యవధిలో పంటలు చేతికి వచ్చేలా ప్రణాళికలు వేసుకుని మరీ సాగు చేస్తున్నారు. కేవలం 25 నుంచి 50 సెంట్ల భూ విస్తీర్ణంలోనే పంటలు పండించి, లాభాలు ఆర్జిస్తున్నారు. స్వల్ప భూ భాగంలో తక్కువ సమయంలో పంటలు సాగు చేస్తూ రూ.20 వేల వరకు ఆదాయం సంపాదిస్తున్నారు.

ఏడాది పొడవునా పండిస్తాం..

ఏడాది పొడవునా కూరగాయలు పండిస్తాం. పొలాన్ని చిన్నచిన్న కమతాలుగా చేసుకుని క్యాబేజీ, బంతిపువ్వుల సాగు చేస్తున్నాం. రోడ్డు పక్కనే పొలం ఉండడంతో అక్కడే పండిన పంట అక్కడే అమ్మేస్తున్నాం. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకుంది. రెండు నెలలు కష్టపడితే రూ.20 వేల వరకు వస్తుంది.

–జి.లక్ష్మయ్య, కూరగాయల రైతు, ఒమ్మి, రాజాం మండలం

ఆదాయం బాగుంది..

ప్రస్తుతం క్యాబేజీ, టమాటా పంటలు పండిస్తున్నాం. ఇప్పుడు మార్కెట్‌లో వీటికి బాగా డిమాండ్ ఉండడంతో ఆదాయం బాగానే వస్తోంది. పండిన పంటను గ్రామంలోనే వీలైనంత వరకు అమ్ముతాం. ఒక్కోసారి బైక్‌పై పొరుగు గ్రామాలకు తీసుకు వెళ్లి, విక్రయిస్తాం. ఇంకా ఓపిక ఉంటే రాజాం, సంతకవిటి ప్రాంతాలకు తీసుకువెళ్లి, అమ్మేస్తాం.

–వి.కుర్మారావు, కూరగాయల రైతు, హొంజరాం, సంతకవిటి మండలం



సంతకవిటి మండలం మిర్తివలస వద్ద సాగు చేస్తున్న టమాటా పంట

తాగునీటి వృథాను అరికట్టారు..

సాక్షి ఎఫెక్ట్...

రేగిడి: మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద ప్రధాన రహదారికి అనుకుని ఉన్న తాగునీటి పైపులైన్ మరమ్మతులు సోమవారం చేపట్టి, తాగునీటి వృథాను అరికట్టారు. గతంలో ఇక్కడి పైపులైన్ లీకు కారణంగా నీరంతా రోడ్డుపైకి వచ్చి చేరేది. దీంతో అటువైపుగా వెళ్లే వారంతా ఇబ్బందులు పడేవారు. ఇదే విషయమై ఈ నెల 9వ తేదీన సాక్షి దిన పత్రికలో పాడైన పైపులైన్ శీర్షిక పేరిట వార్త ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ ఆ ప్రాంతానికి వెళ్లి, పైపులైన్‌ను బాగు చేయించారు.



పైపులైన్ మరమ్మతులు చేపట్టడంతో రోడ్డుపై నీరు లేని దృశ్యం

రైతులు ఆందోళన చెందవద్దు

రామభద్రపురం: రైతులు ఆందోళన చెందవద్దని, ప్రతీ ధాన్యపు గింజ కొనుగోలు చేస్తామని తహసీల్దారు సులోచనరాణి అన్నారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడిన ఆమె.. ఇటీవల వచ్చిన ఫెంగల్ తుపాను వర్షాలకు తడిచిన ధాన్యం కూడా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని, దళారుల బారినపడి మోసపోవద్దని సూచించారు. బూసాయవలస, మిర్తివలస, కొట్టక్కిలలో ఐదు మిల్లర్లకు ధాన్యం కొనుగోళ్లకు అనుమతులు ఉన్నాయన్నారు. ధాన్యం విక్రయాల్లో ఏ విధమైన ఇబ్బందులు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ నెల 12న మళ్లీ వర్షం పడే అవకాశం ఉన్నందున రైతులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ధాన్యపురాశుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట సీఎస్‌డీటీ సాయికృష్ణ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దారు సులోచనరాణి

'క్రాస్‌ప్రోగ్రాం' స్క్రాప్ వేలం

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో క్రాస్‌ప్రోగ్రాం స్క్రాప్‌నకు సంబంధించి, వేలంపాట సోమవారం నిర్వహించారు. గతంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో క్రాస్‌ప్రోగ్రాం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పాడైన తాగునీటి బోర్ల మరమ్మతులు చేపట్టారు. ఈ క్రమంలో సేకరించిన పాడైన బోర్ల పైపులు, ఇతర పనికిరాని సామగ్రిని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సమక్షంలో వేలం వేశారు. పాడైన బోరు పైపు ఒక్కొక్కటి రూ.243లుగా, స్క్రాప్ కిలో రూ.27గా నిర్ణయించి, వేలంపాట కొనసాగించారు. మొత్తం ఏడుగురు వేలంపాటలో పాల్గొనగా, యజ్జల రాజు అనే వ్యక్తి(పాటదారు) మొత్తం రూ.10 వేల ధరవత్తు చెల్లించి, స్క్రాప్ దక్కించుకున్నారు. పాడైన బోరు పైపు ఒక్కొక్కటి రూ.235, స్క్రాప్ కిలో రూ.25గా పాటదారుడు దక్కించుకున్నట్లు తెలుస్తోంది. కార్యక్రమంలో ఎంపీపీ తరఫున తెంటు మధుసూదనరావు, వైస్ ఎంపీపీ భాస్కరరావు, ఏవో శ్రీలక్ష్మి, ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వేలంపాట నిర్వహిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

నేడు నీటి సరఫరా నిలిపివేత

రాజాం సిటీ: పట్టణంలోని పలు ప్రాంతాలకు మంగళవారం నీటి సరఫరా ఉండదని మున్సిపల్ ఏఈ వెంకట్ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. స్థానిక బొబ్బిలి రోడ్డులో పైపులైన్‌కు పడిన లీకుల కారణంగా మరమ్మతులు చేయనున్నామని, వస్త్రపురి, అమ్మవారి, మెంటిపేట ఎస్సీ కాలనీలతో పాటు మల్లయ్యపేట, బొబ్బిలి రోడ్డు, కాలెపు, సెగిడి, మేదర, కంచర వీధులు, లచ్చయ్యపేట, మల్లిఖార్జునకాలనీలకు నీటి సరఫరా ఉండదన్నారు. అయితే ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేస్తామన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రాజాం సిటీ: విజయనగరం జిల్లాలోని క్రీడా మైదానంలో ఈ నెల 8వ తేదీన నిర్వహించిన కరాటే పోటీల్లో రాజాం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కోచ్ ఆర్.శివ సోమవారం తెలిపారు. కాటా విభాగంలో రేగాన అభిషేక్ బంగారు పతకం, బత్తుల నవనీత్ కాటా, కుమిటీ విభాగాల్లో బంగారు పతకం, పూర్ణ మోహిత్ కుమిటీ విభాగంలో రజత పతకం సాధించారన్నారు. సదరు విద్యార్థులను నిర్వాహకులు పతకాలు, ప్రశంసాపత్రాలతో అభినందించారన్నారు.



పతకాలు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

బాడంగి సీహెచ్‌సీలో ఒకేఒక్కడు..

- వైద్యుల గైర్హాజరుతో రోగుల అవస్థలు
- వైద్యసేవలందక తీవ్ర నిరాశతో ఇంటిబాట

బాడంగి: వైద్యుల గైర్హాజరుతో స్థానిక సీహెచ్‌సీకి సోమవారం వచ్చిన రోగులు నానా అవస్థలు పడ్డారు. ఆస్పత్రిలో ఉండాల్సిన ఆరుగురు వైద్యుల్లో కేవలం ఒక్కరంటే ఒక్కరే హాజరు కావడంతో రోగులకు సకాలంలో వైద్యసేవలు అందలేదు. దీంతో వచ్చిన వారిలో చాలామంది నిరాశతో వెనుదిరిగారు. ఆస్పత్రికి వచ్చిన వైద్యుడు శ్రీకాంత్ మాత్రమే ఓ వైపు ఓపీ చూస్తూ.. మరోవైపు ఇన్‌పేషెంట్లను చూశారు. ఈ నేపథ్యంలో వైద్యసేవల నిమిత్తం ఆస్పత్రిని ఆశ్రయించిన వారికి సరైన వైద్యం అందలేదు. దీంతో వారంతా ఇలా అయితే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తూ ఇంటి బాటపట్టారు. ఆస్పత్రి పరిస్థితి రానురాను దిగజారిపోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల క్రితం ఇన్‌చార్జ్ వైద్యుడు నాగేశ్వరరావు సెలవుపై వెళ్లగా, జనరల్, దంత, ఎముకల వైద్యులు ఆస్పత్రికి రాలేదు. ఆస్పత్రిలో వైద్యసేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రోగుల ఆరోగ్యం తనిఖీ చేస్తున్న వైద్యుడు శ్రీకాంత్

4200 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

రేగిడి: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా 4,200 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఏవో జి.మురళీకృష్ణ సోమవారం తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 16,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలును లక్ష్యంగా చేసుకున్నామన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు.

జిల్లా కేంద్రానికి వెళ్లొద్దు

తెర్లాం: సమస్యల పరిష్కారానికి జిల్లా కేంద్రానికి వెళ్లొద్దని, మండల కేంద్రంలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలోనే ఇకనుంచి ప్రజా వినతులు పరిష్కరించడం జరుగుతుందని ఎంపీడీవో రేగి రాంబాబు, డిప్యూటీ తహసీల్దారు గొంగాడ సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వారు మాట్లాడుతూ ప్రజలు, రైతులు తమ తమ సమస్యలు విన్నవించుకుంటే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరి సమస్య అయినా పరిష్కారం కాకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

నా ఇంటి స్థలం కబ్జా చేశారు..

- బాధితుడు వజ్జి అప్పారావు ఆవేదన

బొబ్బిలి: తన ఇంటి స్థలం కబ్జా చేశారని స్థానిక పట్టణ పరిధిలోని గొల్లపల్లికి చెందిన వజ్జి అప్పారావు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇదే విషయమై ఆర్‌డీవో జేవీవీఎస్ రామ్మోహనరావును మండల కేంద్రంలో సోమవారం కలిసి ఫిర్యాదు చేశాడు. గతంలో ఇదే విషయంపై కలెక్టర్, డీఎస్పీలకు కూడా ఫిర్యాదు చేశానని, అధికారులు స్పందించినా టీడీపీ నేతలు జోక్యం చేసుకుని, సెటిల్‌మెంట్ చేసుకోవాలని బెదిరిస్తున్నారని వాపోయాడు. తనకు ఎలాగైనా న్యాయం చేయాలని అతడు విజ్ఞప్తి చేయగా, స్పందించిన ఆర్‌డీవో.. తానే స్వయంగా వచ్చి పరిశీలించి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో బాధితుడు ఊపిరి పీల్చుకున్నాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బొబ్బిలి పట్టణంలోని దాడితల్లి కాలనీలో 2019లో ముగ్గురం(తనతో పాటు) కొనుగోలు చేసిన 10 సెంట్ల ఇంటి స్థలంలో తన వాటా స్థలంలో స్థానిక టీడీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ కాకల వెంకటరావు తదితరుల ప్రోద్బలంతో దారి లేకుండా కబ్జా చేసి, బాత్‌రూం, బోర్లు నిర్మించేశారన్నాడు. ఈ అక్రమంపై తాను ఇప్పటికే కలెక్టర్, ఆర్‌డీవో కార్యాలయాల్లో ఫిర్యాదు చేశానన్నాడు. దీనిపై కలెక్టర్ నుంచి ఆర్‌డీవోకు, అక్కడి నుంచి తహసీల్దారుకు సమస్య పరిష్కారం నిమిత్తం నోటీసులు వెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. చివరకు రెవెన్యూ అధికారులతో కలసి వచ్చినా ఆక్రమణ తొలగించలేదన్నారు. టీడీపీ నేత కాకల వెంకటరావు సూచనలతో అధికారులు సైతం రాజు గారి కోటలోకి వెళ్లి, ఎమ్మెల్యే సమక్షంలో సెటిల్ చేసుకోమంటున్నారని తెలిపాడు. తన స్థలానికి తాను సెటిల్‌మెంట్ చేసుకోవడమేంటని అందుకే ఇప్పుడు మళ్లీ న్యాయం కోసం ఆర్‌డీవోను ఆశ్రయించినట్లు బాధితుడు పేర్కొన్నాడు.



అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు పత్రాలు చూపిస్తున్న బాధితుడు అప్పారావు

వితరణ

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయానికి మండల కేంద్రానికి చెందిన దేనిశెట్టి శ్రీను పలు కాంపిటేటివ్ పుస్తకాలు సోమవారం వితరణ చేశారు. తాను డీఎస్సీ అభ్యర్థినేనని, గత కొన్నేళ్లుగా కాంపిటేటివ్ పరీక్షల కోసం సన్నద్ధమవుతున్నానని, తన వద్ద ఉన్న వివిధ స్టడీ మెటీరియల్, డీఎస్సీ మెటీరియల్‌ను అందజేసినట్లు దాత తెలిపారు.

అవినీతిని అంతమొందించాలి

బొబ్బిలి: స్థానిక పట్టణంలో లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం సోమవారం నిర్వహించారు. అవినీతి అంతం.. లోక్‌సత్తా పంతం అని, అవినీతి లేని పాలన కోసం లోక్‌సత్తా పోరాటం కొనసాగిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు తెలిపారు. సమాజంలో అవినీతిని అంతమొందించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని కోరారు.

దరఖాస్తుదారుల అవస్థలు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని గ్రోత్ సెంటర్ వద్ద ఓ దుకాణం అద్దెకు తీసుకుని, వాహనదారులకు లైసెన్స్ జారీ నిమిత్తం నడుపుతున్న ఎంవీఐ(మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్) కార్యాలయం అడ్రస్ తెలియక పలువురు దరఖాస్తుదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అక్కడి 1250 ఎకరాల స్థలంలో కార్యాలయం ఎక్కడ ఉందో దరఖాస్తుదారులు వెతుక్కోవాల్సిన దుస్థితి. దీనంతటికీ కారణం అక్కడ కార్యాలయం ఉన్నట్లు ఏ విధమైన బోర్డు ఏర్పాటు చేయకపోవడమేనని అందరూ అంటున్నారు. సోమవారం కార్యాలయానికి వచ్చిన దరఖాస్తుదారులు కూడా కార్యాలయం ఎక్కడుందో కనిపెట్టే లోపు తమకు ఇచ్చిన స్లాట్ టైమ్(సమయం) ముగిసిందని వాపోయారు. ప్రతీ సోమవారం ఇక్కడి కార్యాలయానికి వచ్చే ఎంవీఐ(మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్) కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది దరఖాస్తులు అక్కడి నాయుడు అనే వ్యక్తి పరిశీలిస్తున్నారని తెలిపారు.



తెర్లాం: ఆమిటిలో రెవెన్యూ సదస్సు ర్యాలీలో తహసీల్దారు హేమంత్‌కుమార్



రాజాం: ఆగూరులో పాత సచివాలయ భవనం వద్ద రెవెన్యూ సదస్సు



సంతకవిటి: సిరిపురంలో రెవెన్యూ సదస్సుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ గ్రామాన రెవెన్యూ సదస్సులు సోమవారం నిర్వహించారు. భూ సరిహద్దు, విస్తీర్ణం, మ్యుటేషన్ సమస్యలు సహా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలపై అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. 40 రోజుల్లోగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పరిష్కారం కాని సమస్యలను మరోసారి జరిగే సదస్సుల్లో తమ దృష్టికి తీసుకువస్తే సత్వరమే చర్యలు చేపడతామన్నారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



రేగిడి: అంబఖండిలో రెవెన్యూ సదస్సుకు హాజరైన అధికారులు, రైతులు



వంగర: శివ్వాంలో వినతులు స్వీకరించి, పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి చంద్రరావు, తహసీల్దారు ధర్మరాజు

ఆరు నెలలుగా జీతాల్లేవ్..



ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్స్(ఆయాలు)కు ఆరు నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించడం లేదు. దీంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. రామభద్రపురం మండలంలోని 57 పాఠశాలల్లో మొత్తం 58 మంది ఆయాలు పనిచేస్తున్నారు. వీరంతా బకాయి వేతనాలు తక్షణమే చెల్లించడంతో పాటు నెలనెలా జీతాలు సక్రమంగా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై ఎంఈవో తిరుమల ప్రసాద్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. ఆయాల జీతాలు పెండింగ్‌లో ఉన్నది వాస్తవమేనని, వారి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

–రామభద్రపురం

చెత్త వేస్తే రూ.500 జరిమానా



పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా రాజాం మున్సిపాలిటీ పరిధిలో పలుచోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు ఆదేశాల మేరకు చెత్తకుప్పల సమస్యలు ఎక్కువగా ఉన్నచోట చెత్త వేస్తే రూ.500 జరిమానా విధిస్తామని తెలియజేస్తూ బోర్డులు ప్రదర్శించారు. అనవసరంగా చెత్త వేసిన వారికి అపరాద రుసుం విధించడంతో పాటు చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు.

–రాజాం

అటవీ భూముల సాగుకు అనుమతించండి



అటవీ భూముల్లో సాగు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని బొబ్బిలి మండలంలోని గోపాలరాయుడుపేట రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై వారు వారి గ్రామంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరై, ఆర్‌డీవో రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. గత 40 ఏళ్లుగా అటవీ భూములను సాగు చేసుకుని జీవనం సాగిస్తున్న తమపై అటవీ శాఖ అధికారులు కేసులు పెడుతున్నారని, అటవీ భూములు ఆక్రమిస్తున్న వారిపై మాత్రం చర్యలేమీ తీసుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు అటవీ బీట్ ఆఫీసర్ స్వప్నతో ఆర్‌డీవో మాట్లాడి, సాగుకు అవకాశం కల్పించాలని కోరారు. –బొబ్బిలి రూరల్